www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 30 జూన్ 2023

5

అన్నమయ్య

హంస వాహనంపై శ్రీసౌమ్యనాథుడు

నందలూరు: జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పల్లకి సేవ కార్యక్రమాన్ని టిటిడి అర్చక స్వాములు ఆధ్వర్యంలో మాడ వీధుల్లో భక్తుల గోవింద నామస్మరణలు, కోలాటాలు డప్పు వాయి ద్యాల మధ్య వేడుకగా శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు ఊరేగు తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై సరస్వతి దేవి అలంకారంలో శ్రీసౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషా లంకరణలో మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి, ఆలయ మాజీ అధ్యక్షులు సౌమిత్రి, నాని, కాకి చంద్ర, ప్రభాకర్, నాగ సుబ్బయ్య, అర్చకులు సునీల్, సాయి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు : ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం రాత్రికి సింహ వాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ నటేషన్ బాబు తెలిపారు.

హంస వాహనంపై ఊరేగుతున్న సౌమ్యనాథుడు

త్యాగానికి, ప్రేమకు ప్రతీక బక్రీద్

6లో

రాయచోటి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు, ముస్లిములు

'ఉపాధి' పనుల కోసం పోరాటాలు ఉధృతం

-వ్య.కా.స రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

బ్రహ్మంగారి మఠం: రాష్ట్రంలో ఉపాధి పనులు కల్పించి, కూలి రేట్లు పెంపుదల కోసం ఉధృత పోరాటాలు చేస్తామని వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. బ్రహ్మంగారిమఠంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభ మ య్యాయి. ప్రారంభమానికి ముందు ఆయన సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, ఆంజనేయులు సుందరయ్య చిత్రపటానికి పులమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు దేశంలో ఉపాధి పనులు తగ్గాయని, కేంద్రప్రభుత్వం ఉపాధి పనులకు 25శాతం బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని చెప్పారు. పెరుగు తున్న గ్రామీణ పేదల జనాభాకు తగ్గట్లు నిధులు కేటాయిం చడంలో కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరించిందని వాపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం, ప్రతిపక్ష పార్టీలు కనీసం స్పందించటం లేదని పార్లమెంట్‌లో కనీసం నోరుమెదపటం లేదని వారు విమర్శించారు. దేశంలో ధరలన్నీ పెరిగిపోయాయని వాటికనుగుణంగా రూ. 600 కూలి పెంచి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రూరల్ ప్రాంతాలు పట్టణాల్లో కలవడంతో మున్సిపాల్టీలుగా మారాయని, తద్వారా గ్రామీణ పేదల సంఖ్య పెరిగిందని చెప్పారు. అందువల్ల పట్టణ, గ్రామీణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలని పేర్కొన్నారు. శిక్షణా తరగతుల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్లయ్య, సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు. జి.శివకుమార్ వి.అన్వేష్, అనంతపురం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నంద్యాల జిల్లా అధ్యక్షులు సుధాకర్. హిందూపురం జిల్లా అధ్యక్షులు, ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు గోవింద్, వీరయ్య, రాయప్పా, కర్నూల్, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

'గురుకులం'లో గందరగోళం...!

- సిబ్బంది నియామకాల్లో ఇష్టారాజ్యం
- అక్కడ పెత్తనమంతా ప్రాజెక్ట్ ఆఫీసర్‌దే
- జిల్లా గిరిజన సంక్షేమ అధికారులది ప్రేక్షకపాత్రే
- విధులకు వార్డెన్లు డుమ్మా
- ఇబ్బందులుపడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాలో12 గిరిజన గురుకుల పాఠశాలలో ఉన్నాయి. వాటిలో ఒక ఆశ్రమ బాలబాలికలు, ఐదు బాలికల, ఆరు బాలుర పాఠశాల ఉన్నాయి. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1799 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో బాలికలు 845 మంది, బాలురు 954 మంది ఉన్నారు. గిరిజన గురుకుల పాఠశాలన్నీ కూడా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పరిధిలో నడుస్తున్నాయి. వాటిని ఆ జిల్లా పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పర్యవేక్షణ చూడాలి ఉంటుంది. కానీ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. జిల్లాకు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వచ్చే సమ యంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారాలు సమాచారం ఇవ్వడం లేదు. కింద స్థాయి ఉద్యోగులతో తాను మీ జిల్లా వస్తున్నానని, ఏర్పాటు చేయాలని సమాచారం ఇస్తారు. ఆ అధికారి వచ్చేది సంవత్సరానికి ఒక సారి మాత్రమే. అదీ వచ్చినపుడు రాచమర్యాదలు చేయాలి. వసతితో పాటు ఖరీదైన భోజనాలు సమకూర్చాలి. ఇంతటి భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం ఆ ఖర్చు అంతా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు భారంగా మారుతోంది. ఇంతా చేసినా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులంటే గురుకుల ప్రిన్సిపల్‌కు ఇచ్చే మర్యాద కూడా ఇవ్వడం లేదని అధికారులు భాధపడుతున్నారు. గత ఏడాది గురుకులంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు నోటిఫికేషన్ జారీ, భర్తీ సమయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు కనీస సమాచారం లేకుండా అంతా ప్రాజెక్టు అధికారి నియామకాలు నిర్వహించారనే విమర్శలు వచ్చాయి. ఆ నియామకంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియామకాలలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కమిటీ సభ్యులు అయినప్పటికీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పలువురు అధికారులు వాపోతున్నారు. నియామకాలలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారుల పాత్ర లేనట్లు అంతా తానే అయి చేపట్టడంలో అవినీతి జరిగి నట్లు అనుమానిస్తున్నారు. ఈ ఏడాది గురుకుల ప్రిన్సిపల్‌కు భోజ నాలు భాధ్యత ఇవ్వడంతో అక్కడ పనిచేస్తున్న వార్డెన్లు పరిస్థితి ఆయోమయంగా మారింది. ప్రిన్సిపల్ అడ్మినిస్ట్రేషన్ భోజనాలు ఏర్పాటు రెండు పనులు చేయడంలో ప్రిన్సిపల్ పనిభారం పెరిగింది. గత ఏడాది ప్రతి బాలికల పాఠశాలలో వాచ్ ఉమెన్ ఏర్పాటు చేయడం వల్ల జర్నలిస్టు, ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాలను గురుకుల ఆవరణలోకి పంపడం లేదు. గురుకుల పాఠశాల లోపల ఏమీ జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులు కూడా అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులు అడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా ఉంది. జిల్లా గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు సమస్యలొస్తే కలెక్టర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అడుగుతారు. జిల్లాలో వున్న గిరిజన గురుకుల పాఠశాల వెళ్ళితే ఐటిడిఎ పిఒకు ఇచ్చే మర్యాద జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారాలు ఇవ్వడం లేదు. ఎందుకు అంటే గిరిజన గురుకుల పాఠశాలలో బిల్లులు మంజూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పరిధిలో ఉన్నాయి. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఏమీ లేకపోవడంతో గురుకులంలో పలకరింపు లేకపోవడంతో అవమానంగా భావిస్తున్నారు. గిరిజన గురుకులంలో అనేక సమస్యలు ఉన్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాయచోటి గిరిజన బాలికల పాఠశాల

వసతుల కల్పించడంలో అధికారులు విఫలం

గిరిజన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆఫీస్‌కే పమితమవుతున్నారు. గురుకులాలను విజిట్ చేయడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ఉన్నత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మౌలిక వసతులు కల్పించాలని సర్వేలు చేసి అక్కడున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవాలి.

- నరసింహ, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, అన్నమయ్య.

వార్డెన్లు కొనసాగుతున్నారు

జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలలో ప్రస్తుతం వార్డెన్లు అందరూ ఎవరి స్థానంలో వారు విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇంకా పూర్తిస్థాయిలో ఎక్కడ నియమిస్తారో తెలియదు. వేచి చూడాలి.

- అబ్ సలాం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, అన్నమయ్య.

రాజంపేట : మాట్లాడుతున్న జనసేన నాయకులు

పవన్ కల్యాణ్‌ను విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి - రాయచోటి

జన సేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థాయి మరచి విమర్శించడం సరి కాదని కాపు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుడ్డా శరత్ బాబు రాయల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్‌ను ఉద్దేశించి నాలుగు భార్యలును వదిలిన పవన్ కల్యాణ్ అని మాట్లాడడం మంచిది కాదన్నారు. ఇచ్చిన వాగ్దానలను పూర్తి చేశామని సంకలు గుద్దుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి మద్యాన్ని ఎందుకు నియంత్రలేదో చెప్పాలన్నారు. ఎంపీలను గెలిపిస్తే కేంద్ర మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి తన సోదరుడిని కాపాడుకునేందుకు మెడలు వంచుకుని ఢిల్లీకి పరుగెడుతున్నారని ఆరోపించారు. పవన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా మాట్లాడటాన్ని కాపు సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.

రాజంపేట అర్బన్ : పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి వైసిపి నాయకలకు లేదని రాజంపేట జనసేన నాయకులు తెలిపారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమ్మఒడి బటన్ నొక్కే కార్యక్రమంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా విమర్శించడం తగదన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి తెలుగు మాట్లాడటం కూడా సరిగా రాదని తెలిపారు. పేపర్ చూడకుండా మాట్లాడలేడని విమర్శించారు. చిన్న పిల్లలను ఉద్దేశించి భావి తరాలకు సందేశాన్ని ఇవ్వాల్సిన వ్యక్తి రాజకీయ విమర్శలకు వేదికను చేయటం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భాస్కర్ పంతులు, నంద్యాల హరి, పోలిశెట్టి శ్రీనివాసులు, వెంకటయ్య, వీరయ్య ఆచారి, ఎం.వెంకటేశ్వర రావు, గోపికృష్ణ, రామ శ్రీనివాస్, చౌడయ్య, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కత్తి సుబ్బరాయుడు, వీర మహిళలు జడ్డ శిరీష, మాధవి పాల్గొన్నారు.

ఆజాద్ హత్యకు యోగీ సర్కార్ కుట్ర : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భీమ్ ఆర్మీ చీఫ్, ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఆజాద్ హత్యకు యోగీ ఆదిత్యనాథ్ సర్కార్ కుట్ర చేస్తోందని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌పై జరిగిన హత్యాప్రయత్నాన్ని ఖండిస్తూ తన కారాల్యయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహరాన్‌పూర్‌లో ఆజాద్‌పై జరిగిన తుపాకుల దాడి ఇందులో భాగమేనని పేర్కొన్నారు. ఉత్తర భారతంలో ఆజాద్ బలమైన నాయకుడని తెలిపారు. అయన ఆజాద్ సమాజ్ పార్టీని స్థాపించి ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేశారని చెప్పారు. మనువాద భావజాలన్ని తీవ్రంగా వ్యతిరేకంచే ఆజాద్ అంటే బిజెపి, ఆరెస్సెస్ సంఘ్ పరివార్ గుంపులకు గిట్టదని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఆజాద్ విస్తృతంగా ప్రచారం చేసే అవకాశం ఉన్నందున, సంఘ్ పరివార్ గుంపులను ఉసిగొలిపి, ఆజాద్‌ను హత్య చేయించాలని యోగీ సర్కార్ కుట్రలు చేస్తోందని విమర్శించారు. సహరాన్‌పూర్‌లో ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా, సంఘ్ పరివార్ మూకలు ఆజాద్ కారు మీద తుపాకులతో కాల్పులు జరిపాయని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

కేరళ డిజిపిగా పోరుమామిళ్ల వాసి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన ధర్వేష్ మోహిన్ కేరళ రాష్ట్ర డిజిపిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ధర్వేష్ పోరుమామిళ్లలోని బెస్తవీధిలో పుట్టి పెరిగారు. ఆయన తండ్రి అటవీ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ధర్వేష్ విద్యాభ్యాసం పోరుమామిళ్లలోనే సాగింది. డిగ్రీ, పీజీ తిరుపతిలో చదివేశారు. ఐఎఎస్ కావాలనే పట్టుదలతో కష్టపడి పరీక్షలు రాశారు. మొదటి సారి ఇండియన్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఎంపికయ్యారు. దాన్ని వదులుకుని మరో సారి ఐఎఎస్‌కు ప్రీపేర్ అయ్యారు. ఈ సారి ఐపిఎస్‌గా ఎంపిక కావడంతో కేరళ రాష్ట్రంలోనే అంచలంచెలుగా ఎస్‌పి స్థాయి నుంచి డిఐజి, ఐజి హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం డిజిపి స్థాయికి చేరుకున్నారు. తమ బాలమిత్రుడు కేరళ డిజిపిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. పోరుమామిళ్లలోని బంధువులు, స్నేహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకుంటున్నారు.

పాలిటెక్నిక్‌లో 'శ్రీసాయి' విద్యార్థుల ప్రతిభ

రాయచోటి: శ్రీ సాయి పాలిటెక్నిక్ విద్యార్థులు మూడవ సంవత్సరం పాలిటెక్నిక్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ విభాగం నుంచి ఎస్ కాజా మొహిద్దిన్ 96.2 శాతంతో మొదటి ర్యాంకు, పి పురుషోత్తం 92.5 శాతంతో రెండవ ర్యాంకు, ఈ మహాలక్ష్మి 92.3 శాతంతో మూడవ ర్యాంకు, ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి ఎస్. ఎం.సబీహా 96.7శాతంతో మొదటి ర్యాంకు సి.నందిని 93.5 శాతంతో రెండవ ర్యాంకురెడ్డి ప్రసన్న 91.6 శాతంతో మూడవ ర్యాంకు కైవసం చేసుకున్నారని వివరించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి విభాగానికి సమానమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ పాలిటెక్నిక్ విభాగపు ఇన్‌ఛార్జి వి.ప్రతాప్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ సీని యర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎస్.ముని గోపాల కృష్ణను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. బుధవారం ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పట్టణానికి చెందిన ఎన్.మునిగోపాలకృష్ణను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి అండే రంగారావు ప్రకటించారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అన్నమయ్య జిల్లా సబ్ కమిటీలో మదనపల్లె నుండి వెంకటరమణారెడ్డి, మునిరత్నమయ్య, జగన్మోహన్, ధనలక్ష్మి, కృష్ణకుమార్, ఎన్.మునిగోపాలకృష్ణలకు చోటుకల్పించారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఎన్.మునిగోపాలకృష్ణకు మదనపల్లి పట్టణానికి చెందిన ప్రొఫెసర్ శ్రీనివాసులు, గొల్లపూడి తిరుపతిరావు, నాగరాజు, ప్రొఫెసర్ చంద్రశేఖర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

'స్వచ్ఛందంగా సేవలు కొనసాగించాలి'

ప్రజాశక్తి - రాయచోటి

మానవతా సేవలో కుల మత ప్రాంత లేదా అభిప్రాయాలు లేకుండా స్వచ్ఛందంగా సేవలు కొనసాగించాలని వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఆర్ కళ్యాణ మండపంలో మానవతా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. రాయచోటి మానవత శాఖ అధ్యక్షులు కనపర్తి శివశంకర్ రెడ్డి, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అధ్యక్షతన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముందుగా రేస్కో మాజీ చైర్మన్ సదిపిరాళ్ళ కృష్ణారెడ్డి, కడప శ్రీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్ వారి సౌజన్యంతో శాంతి రథంను మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మానవత కడప జిల్లా డైరెక్టర్ రామాంజులురెడ్డి, ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ యాదవ్ , మానవత గౌరవ డైరెక్టర్ లోకనాథ రెడ్డి,సెంట్రల్ డైరెక్టర్ నిమ్మనపల్లి సహదేవ రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం నుతనగా ఎన్నికైనా కార్యవర్గానికి మానవత జిల్లా అధ్యక్షులు ప్రసాద్ యాదవ్ అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా తత్వంతోపాటు సమాజ సేవకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు. మనం శాశ్వతం కాదని, మనం చేసే సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలుస్తాయని చెప్పారు. మాజీ ఎంపిపి పోలు సుబ్బా రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఒక ఫ్రీజర్ బాక్స్‌ను మానవత సంస్థకు అందజేస్తామని తెలిపారు. భవి ష్యత్తులోనూ మానవత సేవలకు తమ సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టంగా తెలియజేశారు. జడ్‌పిటిసి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ సమిష్టి కృషితో మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా అవసరం అయ్యే వారికీ సేవలు అందజేయడం చాలా సంతోషదాయకం అని అన్నారు .మానవత సంస్థకు ఎ విధమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు .మాజీ అధ్యక్షుడు కనపర్తి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో 600 పై గా సభ్యత్వాలు నమోదు చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యదర్శి రామానాయుడు సహకారం మరువలేనిది అన్నారు. నూతన అధ్యక్షులు వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో రాయచోటి మానవత శాఖ తరపున మెరుగైన సేవలు అందజేయడంతో పాటు మానవత సంస్థ సభ్యత్వాలు నమోదు పెచేందుకు కృషి చేస్తామన్నారు.

మానవత రథాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి, సభ్యులు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

జన జాగృతి సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సంబేపల్లె (రాయచోటి)

జులై ఏడవ తేదీన నిర్వహించబోయే మాదిగల జన జాగృతి సభను విజయంవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్దవీటి రమణయ్య పేర్కొన్నారు. గురువారం సంబేపల్లి మండలం ప్రకాశ్ నగర్‌కాలనీలో కరపత్రం విడుదల చేశారు. రాష్ట్ర కో-కన్వనర్ ఎస్.రామాంజనేయులు ఆదేశంతో సంబేపల్లె ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు జల్లా మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు పి రమణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపఅధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య నాయకత్వంలో జులై 7 న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల జన జాగృతి సభను విజయవంతం చేయడానికి మండలం నుంచి వేలాదిగా మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలపై అవలంబిస్తున్న తీరుకు నిరసనగా చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వి.వెంకటరమణ, బి.లక్ష్మయ్య, ఆదినారాయణ, వీరనాగయ్య, వెంకటస్వామి రఘు, జెఎ.వెంకట రమణ, మహిళా కార్యకర్తలు జె.లక్ష్మి పార్వతి, సిఎం.లక్ష్మీదేవి, వెంకటరమణమ్మ, జయ రాములు, ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షులు ఎం.రమణయ్య అధ్యక్షతన ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యా శాఖ అధికారి గంగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించడం అనే కొత్త సంప్రదాయానికి యుటిఎఫ్ నాంది పలకడం శుభ సూచికమన్నారు. రెండవ మండల విద్యాశాఖ అధికారి సుబ్బరాయుడు మాట్లా డుతూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చుదిద్దవలసిన బాధ్యత అందరి మీద ఉన్నదని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీవో పైన యుటిఎఫ్ చేసిన పోరాటాల ఫలితంగా మూడు కిలోమీటర్ల లోపల ఉన్న పాఠశాలలను తప్పించి కేవలం ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలలను మాత్రమే విలీనం చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో యుటిఎఫ్ ఉద్యమాలకు పిలుపునిచ్చినప్పుడు ఉపాధ్యాయులు ఉద్యమాలలో పాల్గొనాలని కోరారు. పిఎంపి కేజియాలత, కెవిఎస్ కిషోర్, ఎం.సతీష్, కె.వెంకటేశ్వర్లు, ఎం.నాగభూషణం రాజు, జి.శివ నరసింహులు సన్మానం అందుకున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి శివయ్య, గౌరవాధ్యక్షులు కే.పాపయ్య, సీనియర్ నాయకులు ఎం.నాగేశ్వర్ గౌడ్, పి.వెంకటసుబ్బయ్య, కే.శివకుమార్, ఉపాధ్యాయులు వీరయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, పి.శ్రీనివాసులు, రామచంద్ర, కవిత, రెడ్డమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

-ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రెండు బృందాలుగా అధికారులు ఏర్పడి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందాయా లేదా అని విచారిస్తారని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందని వారికి వెంటనే అందేలా చూడడం ఈ రెండు బృందాల కర్తవ్యమని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ప్రజలకు ఏమి చేస్తారో కూడా ప్రకటించకుండా యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి సాయి కిషోర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ సుకుమార్ రెడ్డి, కన్వీనర్ సుధాకర్ రాజు, జి.రమేష్, కాకర్ల నాగేశ్వరరావు, సిహెచ్ రమేష్, అమర్, రమణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన డిఎల్‌పిఒ

రాజంపేట రూరల్ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజంపేట డిఎల్‌పిఒ పార్వతి గురువారం రాజంపేట ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒకు ఎమ్మెల్యే మేడా అభినందనలు తెలిపారు.

ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సుద్దమల్ల పంచాయతీ తూవ్వపల్లె చెందిన పద్మావతి అనే మహిళ గురువారం ఉపాధి పనులకు పోయి పనులు చేస్తుండగా సొమ్మసిల్లి కిందపడిపోయింది. తోటి ఉపాధి కూలీలు పద్మావతి వద్దకు వెళ్లి చూడగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైసిపి కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి పద్మావతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం వచ్చేం దుకు కృషి చేస్తామని ఇసి శ్రీకాంత్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వర్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. వారి వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ శేఖర్‌రెడ్డి, గ్రామ స్తులు ఉన్నారు.

గంగమ్మ జాతరలో రాజకీయ ప్రముఖులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పుత్తనవారిపల్లిలో గురువారం గంగమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక నగలు పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ జాతర కు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు కొల్లం గంగిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఎపి వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, రైల్వే కోడూరు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, నలిని కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పుల్లంపేట సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, కార్తీక్‌రెడ్డి, రంగారెడ్డి, భోగా పార్థసారథి పాల్గొన్నారు.

ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నరసింహారెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ వీర ప్రకాష్

పట్టణ ప్రజల సౌకర్యార్థం అత్యాధునిక టెక్నాలజీతో అందు బాటులోకి వచ్చిన అపోలో డయాగ్నోస్టిక్స్ ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకో వాలని రాజంపేట వైసిపి సంయుక్త కార్యదర్శి తంబెళ్ల నరసింహారెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్నటువంటి అమర్ హాస్పిటల్‌లో నూతనంగా అపోలో డయా గ్నోస్టిక్స్‌ల్యాబ్‌ను డాక్టర్ వీరప్రకాష్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఆధునిక టెక్నాలజీతో కూడిన ప్రయోగశాలను అందుబాటులో తీసుకురావడం హర్షణీయమన్నారు. పట్టణ ప్రజానికం అపోలో డయాగ్నోస్టిక్స్ ప్రయోగ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రయోగశాలలో బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, హేమటాలజీ, ఎలక్ట్రో లైట్స్ వంటి అన్ని రకాల పరీక్షలను తక్కువ ధరలకే చేయడం జరుగుతుందన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రయోగశాల వద్దకు రాలేని వారికి ఇంటి వద్దకే వచ్చి శాంపుల్స్ తీసుకొని రిపోర్ట్ ఇవ్వడం ఇస్తామని చెప్పారు. అనంతరం నరసింహరెడ్డిని ప్రయోగశాల నిర్వాహకులు నరేష్, డాక్టర్ వీర ప్రకాషలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అపోలో డయా డయాగ్నోస్టిక్స్ ప్రయోగశాల నిర్వహకులు తిప్పన నరేష్, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

సిసిరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి

రోడ్డు లేని గ్రామం ఉండకూడదు : ఎంపిపి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో రోడ్డులేని గ్రామం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో సిసిరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీలోని పాపక్కగారిపల్లిలో సిసి రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో సిసి రోడ్డు నిర్మాణం మంజూరు అయ్యిందని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే దృఢ సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. మండలంలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా టెస్ట్ టీమ్‌కు నందలూరు క్రీడాకారుడు ఎంపిక

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని సబ్ సెంటర్ క్రీడాకారుడు మారుతీ శంకరా చారీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీ డేస్ (టెస్ట్‌టీం)కు ఎంపికైనట్లు గత నెలలో జరిగిన క్యాడ్ క్యాంప్‌లో మంచి ప్రదర్శన కనబరినందుకు గాను, జూలై 1న జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీ డేస్‌కు ఎంపికయ్యారని సబ్ సెంటర్ హెడ్ కోచ్ గయాజ్ తెలిపారు. నందలూరు నుంచి ఇప్పటికే రాష్ట్రస్థాయిలో చాలా మంది రాణిస్తూ ఉండడం, అదే కోవలో మరో క్రీడాకారుడు ఎంపికవ్వడం పరిణామమని అన్నారు. తోటి క్రీడాకారులు అభినందనలు తెలి పారు. మారుతీ శంకరా చారి జిల్లా టీంకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మారుతి ఎంపికపట్ల తల్లిదండ్రులు సర్వేశ్వరా చారీ, మూర్తమ్మ, సంతోషం వ్యక్తం చేశారు.

త్యాగానికి, ప్రేమకు ప్రతీక బక్రీద్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నపిల్లలు, ముస్లిం సోదరులు కొత్త బట్టలు వేసుకొని స్థానిక ఈద్గా మైదానం, మదరసా మసీదు, లాల్ మసీదులో ప్రత్యేక నమాజ్లు చేశారు. ఈద్గాలో మతగురువు షర్ఫుద్దీన్ హుస్సేని మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా సత్యం వైపే నిలబడాలని, దైవ మార్గంలో సర్వస్వాన్ని ధార పోయడానికి సిద్ధపడాలని ఇబ్రహీం జీవితం ముస్లిం లకు ఆదర్శమన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని దీని ద్వారా చెడు వ్యసనాలు దారితీస్తుందని అన్నారు. మాంసం విక్రయించే ఆరోగ్యమైన జంతువులను మున్సిపాలిటీ అధికారులు ముద్ర వేయాలని కోరారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుతూ అలింగనం చేసుకున్నారు. **బి.కొత్తకోట :** పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పిటియం రోడ్డులోని ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపు కున్నారు. కార్యక్రమంలో సచివా లయం కన్వీనర్ ఎస్ఎస్ ఫయాజ్, గుమ్మడికాయల చాంద్‌బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అయుబ్‌బాషా, డాక్టర్ అరిఫ్, అహ్మద్‌బాషా, హైదర్, సాదిక్, షఫీ, సద్దాం, ఖాదర్ బాషా, మున్షిద్, ముబీద్,మియా, షమీ, షాను, జాఫర్ బై, స్వాతి జిరాక్స్ సెంటర్ చాంద్ బాషా, జిఎం, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, సిపిఐ సలీం, సిపిఐ బషీర్, ఎంపిటిసి సయ్యద్ పాల్గొ న్నారు. **రాజంపేట రూరల్ :** త్యాగ శీల తకు ప్రతీకగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను జరుపుకుంటారని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి తెలి పారు. పట్టణ శివారులోని ఈద్గాలో ముస్లిం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణ వైసిపి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం స్థానిక ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ కరస్పాండెంట్ నంద కిషోర్ ఆధ్వర్యంలో ఎస్‌టి కాలనీ నిరుపేద కుటుంబంలోని పిల్లలకు స్కూల్ తరపున దాదాపు 23 మందికి ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజులు, ఉపాధ్యాయులు చైతన్య, శివ శంకర్, సుజిత, భాగ్య, స్వాతి, అనుపమ, విద్యార్థులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలో బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లిం మైనారిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నిమ్మనపల్లి, కొండయ్య గారిపల్లె, సైదాపేట, రాచవేటి వారిపల్లె, చౌకిళ్ళవారిపల్లె, ముష్టూరు, చల్లవారిపల్లె, సింగంవారిపల్లె, సఖి బండవారిపల్లె, తురకపల్లె తదితర గ్రామాల్లో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. **కలికిరి :** మండలంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. కలికిరిలో కొత్తగా నిర్మించిన ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థన నిర్వహించి బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మషా యక్ బోర్డ్ జనరల్ సెక్రటరీ, వైసిపి స్టేట్ సెక్ర టరీ కెఎస్.అఫ

ముస్లిం సోదరుడిని ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే మేడా

బి.కొత్తకోట : సాముహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

మోహిద్దీన్, సర్పంచ్ ఇష్ఠి యాక్ అహ్మద్, మాజీ సర్పంచ్ షాహెబ్ ఉద్దీన్, ప్రొపెసర్ షేక్‌ముబారక్, ఇంతియాజ్‌అహ్మద్, మునీర్ అహమ్మద్, గడిముస్లీం సోద రులు పాల్గొని బక్రీద్ వేడుకలను నిర్వహించారు. **రామసముద్రం :** ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థన నిర్వహించి బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా నందు ఈద్ ఉల్ జహ నమాజు నిర్వ హించి ప్రపంచ శాంతి కోసం, దేశ ప్రజల కోసం, హాజ్ యాత్రికుల క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణం లోని నక్కలదిన్నె వద్ద ఉన్న ఈద్గాలో ముస్లిం సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలల్లో ఎమ్మెల్యే నవాజ్ బాషా పాల్గొన్నారు. **పీలేరు :** బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మదనపల్లి మార్గంలోని బోదేషావలి దర్గా వద్ద ఉన్న ఈద్గా మైదానంలో ఇమామ్ సూచనలతో సాముహిక ప్రార్థ నలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నరసింహుడు సిబ్బంది గట్టి బందోబస్తుకు చర్యలు తీసుకున్నారు. **గాలివీడు :** బక్రీద్ పర్వదిన సందర్భంగా మండలంలోని 17 గ్రామాలలో ఉన్న ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు సోదర భావంతో ఆలింగనము చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **నందలూరు:** బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు నాగిరెడ్డిపల్లి, అరవపల్లి, నందలూరు, టంగుటూరు ఈద్గాలలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగణం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **పెద్దమండ్యం :** మండలంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రార్థన నిర్వహించి బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్య క్రమంలో ముస్లింసోదరులు పాల్గొని వేడుకలను ద్విగ్విజయంగా నిర్వహించారు. **వాల్మీకిపురం:** స్థానిక బైపాస్ రోడ్డు, నమాజ్‌కట్టవీధి, హసన్‌ఖాన్‌వీధి, పునుగుపల్లె, చింతపర్తి, గండబోయనపల్లె గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేయాలని, ఇస్లాం ఆశయాలకు అనుగుణంగా స్వార్థాన్ని వీడనాడి శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. ప్రవక్త ఇబ్రహీం మహోన్నతమైన త్యాగనిరతి ఆదర్శనీయమని ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, వైసిపి నాయకులు ఇలియాజ్, సమీ, ఇమ్రాన్, బాల, బాబు, అలీఅన్సర్ పాల్గొన్నారు.

కొండెక్కిన మాంసం ధరలు

- మటన్ కిలో రూ.750, చికెన్ కిలో రూ.250, స్కిన్‌లెస్ రూ.300

ప్రజాశక్తి-రాయచోటి

మాంసం ధరలు అమాంతంగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మాంసాహారం వద్దు ఖాఖాహారమే ముద్దని అంటున్నారు. జిల్లాలో మాంసం కిలో ధర ఎనిమిది వందల రూపాయలు అమ్ముతున్నారు. ఇక చికెన్ కిలో ధర రూ. 250 నుంచి రూ. 300 రూపాయలు, నాటుకోడి చికెన్ కిలో రూ. 750 రూపాయలు పలుకుతున్నది. సామాన్యుడు ఆదివారం వచ్చిందంటే మాంసం తినాలని ఆలోచన కలుగుతున్నది. అయితే ఇటీవల మాంసం ధరలు పెరగడంతో చికెన్ కొనేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. ఇందుకు ప్రధాన కారణం గతంలో చికెన్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి కానీ ఇటీవల కొద్ది నెలలుగా చికెన్ ధరలు విపరీతంగా పెరగడంతో చికెన్ తినకుండా కూరగాయలు తినేందుకే ఎక్కువమంది ముగ్గు చూపుతున్నారు. ఇది ఇలా ఉంటే మరికొందరు కోడిగుడ్లుతో సరిపెట్టుకుంటున్నారు. గతంలో కోడిగుడ్లు రూ.60 రూపాయలు డజనుండగా నేడు డజన్ రూ.80 రూపాయలు చొప్పున అమ్ముతున్నారు. కోడిగుడ్లు కూడా కొనలేని పరిస్థితికి వచ్చింది. ఇక కూరగాయలు కొందామనుకున్నా కూడా అవి కూడా రోజురోజుకు ధరలు పెరగడంతో పచ్చడి మెతుకులే పరమాన్నంగా పేదల భావించాల్సిన పరిస్థితి నెలకొంది. మాంసం చికెన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న ధరల నియంత్రించాల్సిన అధికారులు పట్టినట్టుగా ఉండడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మాంసం చికెన్,మటన్ మాంసం ల అధిక రేట్లు ను నియంత్రించే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

మాంసాహారం వద్దు..శాఖాహారమే ముద్దు

మాంసకృతులు తక్కువ ధరలో మొక్కల నుంచి లభిస్తాయి. మాంసాహార మాంసకృతుల కన్నా శాఖాహార మాంసకృతులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుండెసంబధ వ్యాధులను తగ్గించడానికి మొక్కల సంబంధ మాంసుకుతురైన కందిపప్పు, శనగపప్పు, మినప పప్పు, పెసర పప్పులు బాగా ఉపయోగ పడతాయని చెప్పవచ్చు. అధిక ధరలు పెట్టి మాంసాహారం కొనీకన్నా తక్కువ ధరలో లభించే పప్పులు కోనడం ఎంతో మేలు.

- ప్రకాష్‌రెడ్డి, జెవివి జిల్లా కార్యదర్శి, రాయచోటి

ఆలయానికి ఇన్వర్టర్ వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి మదనపల్లి పట్టణం నీరుగుట్టవారిపల్లెకు పల్లె లైఫ్ కేర్ మెడికల్ యజమాని నాగసుబ్రహ్మణ్యం, శేష్ కుమార్‌లు రూ.20 విలువ చేసే ఇన్వర్టర్ వితరణగా ఇచ్చారు. గురువారం వారు మల్లయ్య కొండకు చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇన్వర్టర్‌ను పూజారి ఈశ్వరప్పకు అందించారు. వారి దాతృత్వాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మల్లెడ్డి, ఇఒ రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి ,కొండకిట్ట, భక్తులు ప్రశంసించారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏకలవ్య జయంతి ఉత్సవాలను గురువారం జమ్మల మడుగులో ఎన్‌టిఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగు లకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ పగడాల నాగన్న, శబరి కాలనీ గిరిజన యూత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎరువాకమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధి లోని శ్రీ ఎరువాకమ్మ గంగ మ్మ తల్లి ఆలయ 26వ వార్షి కోత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఘ నంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యా హ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో నగర పురవీధుల్లో నాలుగు రోడ్ల కూడలి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలమాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట : తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలందరూ గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక కోటంగురువాయ పల్లెలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు చేశారు. టిడిపి రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముత్యాల కిరీటం వితరణ

వేంపల్లె : స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి పబ్బతి సురేష్‌బాబు అనే దాత ముత్యాల కిరీటాన్ని విరాళం ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్ తెలిపారు. వేంపల్లె గ్రామానికి చెందిన పబ్బతి సురేష్‌బాబు ధర్మపత్ని లక్ష్మి రూ.20 వేలు విలువ చేసే ముత్యాల కిరీటం, ముత్యాల తోరణం, వింజామర్లు ఏకాదశి సందర్భంగా దేవస్థానానికి ఇచ్చినట్లు చెప్పారు. దాతకు దేవస్థానం తరపున సత్కరించి, ప్రసాదం అందజేశారు. భక్తుల సహకారం మరువలేనిదన్నారు.

లోకేష్‌ను కలిసిన ప్రవీణ్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): నెల్లూరు జిల్లా గూడూరు నియోజ కవర్గం కాకువారిపాలెం దగ్గర యువగళం పాద యాత్ర శిబిరంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను ప్రొద్దుటూరు పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజ కవర్గంలోని ప్రజల సమస్యలు, ప్రస్తుత రాజ కీయ పరిస్థితులుపై చర్చించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ, టిడిపి ఎన్నికల మేనిఫెస్టో ప్రజల్లోకి ఎలా తీసుకు పోతున్నారనే విషయాలపై లోకేష్ చర్చించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల రూరల్ : పట్టణ శివారులో ఉన్న శిల్పారామంలో బక్రీద్ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ముస్లిం కుటుంబాలు ఆనందో త్సాహాలతో గడిపారు. మనోహర్, మహాలక్ష్మీ ఫర్టిలైజర్స్ వారి సౌజ న్యంతో విజిల్ డ్యాన్స్ అకాడమీ కడప వారి చిన్నారులచే శ్రీ సింహ మాస్టర్ అధ్వర్యంలో వారి శిష్యబృందం ఏర్పాఉ చేశారు. జానపదం, వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

1 నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ జూలై 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ రంగనాథరెడ్డి డాక్టర్ కల్పన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఈ శిక్షణ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

బ్రహ్మంగారిమఠం: మండలంలోని చెంచయ్యగారిపల్లెకు చెందిన బాల నరసింహులు అనే రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. వ్యవసాయం గిట్టుబాటు గాక, వేసిన మూడు బోర్లు ఎండి పోవడంతో అప్పుల బాధతో ఆ రైతు ఆత్మహత్య చేసు కున్నాడు. ఆ కుటుంబాన్ని గురువారం ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు పరామ ర్శించారు. ఈ సందర్భంగా దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ నరసి ంహులు కుటుం బాన్ని ఇంతవరకు వ్యవసాయశాఖ అధికారులు, రైతు భరోసా అధికారులు, సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ నాయకులుగానీ పరామ ర్శించలేదన్నారు. వారికి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. అప్పు ఇచ్చినవారి వేధింపుల నుంచి ఆ కుటుంబాన్ని పోలీస్ అధికారులు కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రావలసిన నష్టపరిహారం ఇవ్వాలని, భార్య పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్తింపజేయాలని కోరారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులను కలిసి నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గోవిందు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి

డ్రైయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాలతో గురువారం బిసికాలనీలో రూ.20 లక్షల సిఎండిఎఫ్ నిధులతో డ్రైయినేజీ పనులను ఆ గ్రామ సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామ స్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లారు. నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో, నాయకులు సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెరకార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతి ఆంజనేయులు, తురక ఓబులేసు, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన వీరబల్లిలో తన అత్త రామలక్షుమ్మ ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో ఆయన తనయుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డితో కలసి పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించారు. కొన్ని సమస్యలను ఎంపీ మిథున్‌రెడ్డితో చర్చించారు. సుండుపల్లి, రాయచోటి ప్రాంతాల నుంచి ప్రజలు, పార్టీ నాయకులు హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం బావమరుదులు గాలివీటి విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి మేనల్లుడు విజయ సాగర్ రెడ్డిలు ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల మాజీ సింగల్ విండో అధ్యక్షులు దేశాయి చెన్నకృష్ణారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న రాకేష్‌రెడ్డి

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-పీలేరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే జివి.శ్రీనాథ్‌రెడ్డి తనయుడు జివి.రాకేష్‌రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని 3వ సచివాలయం పరిధిలోని కోటపల్లిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వాలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో కొత్త కొత్త పథకాలను తీసుక వచ్చిందన్నారు. ఈ పథకాలకు అర్హులైన వారిని వాలంటీర్లు గుర్తించి, వారు లబ్ధి పొందేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత వాలంటీర్లకు ఉందని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వార్డుసభ్యులు, గృహసారథులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ రమాదేవి

'శ్రీజ్ఞానంబికా'లో జాతీయ గణాంక దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్థిక ప్రణాళిక రంగాలలో, విధాన రూపకల్పనలో గణాంకాల పాత్ర, ప్రాముఖ్యతను వివరించేందుకు ఏటా జాతీయ గణాంకాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. గురువారంకళాశాలలో జాతీయ గణాంకాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సెమినార్లు, చర్చలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు క్విజ్, పిపిటి ప్రెసెంటేషన్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశామన్నారు. క్రీ.శే.ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జూన్ 29న తేదీన జాతీయ గణాంకాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడిపై దాడి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గాయపడ్డ అఫ్రోజ్ అలీఖాన్

యువకుడిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. స్థానిక ఎస్ఐ రామక్రిష్ణ తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి, కందూరు రోడ్డులో నివాసం ఉంటున్న రహమత్ ఖాన్ కుమారుడు అఫ్రోజ్ అలీఖాన్ మదనపల్లిలో ఓ సెల్ షాపును నిర్వహిస్తున్నాడని తెలిపారు. గురువారం బక్రీదు పండుగ సందర్భంగా నిమ్మనపల్లికు వచ్చాడని అన్నారు. ఇదే గ్రామానికి చెందిన సమీప బంధువైన ముఖాసిద్ అలీఖాన్ (45)కు, అఫ్రోజ్‌కు గత కొంతకాలంగా వివాదాలు నెలకొన్నట్లు ఎతిపారు. గురువారం మధ్యాహ్నం ఇంటివద్ద ఇద్దరూ ఒకరికొకరు ఎదు రుపడి కవ్వింపు చర్యలకు దిగడంతో గొడవకు దారి తీసిందన్నారు. ఇరు వురు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో అఫ్రోజ్ అలీఖాన్ తలకు తీవ్రగాయం కాగా, ముఖాసిద్ అలీఖాన్ కూడా గాయపడ్డారని చెప్పారు. చికిత్సల నిమిత్తం స్థానికులు ఇద్దరని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కుటుంబ కలహాలతో మహిళ ఉరి పెట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. మండలంలోని ఆర్ఎం తండా పంచాయితీ బోనాసువారిపల్లెకు చెందిన రమణ భార్య నిరోష(27), ఇంటిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. గుర్తించిన కుటుంబీకులు హుటాహుటిన బాధితురాలని తంబళ్లపల్లి వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ వెంకటరామయ్య ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బాధితురాలి కుటుంబీకులు సూచనలపై బెంగుళూరు ఆసుపత్రికి రిఫర్ చేశారు.